క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్ష చేస్తున్న కె. రవికుమార్‌రెడ్డి

బద్వేలు : పట్టణంలోని బీవీఆర్ ఐ ట్రస్ట్ కేంద్రంలో మంగళ, బుధవారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 24 వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో వీరారెడ్డి అల్లుడు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.రవికుమార్‌రెడ్డి 250 రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే బద్వేలుకు చెందిన సంజీవినీ ఆసుపత్రి డాక్టర్ల బృందం రోగాలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీవీఆర్ ఐ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త కె.రితేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



కలర్‌బెల్ట్ అందుకున్న క్రీడాకారులతో రమణారెడ్డి, కోచ్‌లు

పోరుమామిళ్ల : క్రీడాకారులు ప్రతిభతో రాణించి, రాష్ట్ర జాతీయస్థాయికి ఎదగాలని డాక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలో తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కలర్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమంలో రమణారెడ్డి పాల్గొని 40 మంది క్రీడాకారులకు కలర్ బెల్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ నాయబ్ రసూల్, కోచ్‌లు నరసింహ, ఉస్మాన్, గోవర్ధన్, సుభాష్ పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



పూజలందుకుంటున్న దేవతామూర్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని సాయమ్మ బావి దగ్గర బుధవారం శబరిమఠం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో వైవీ శ్రీనివాసులరెడ్డి (బాబుస్వామి) సారథ్యంలో వైభవంగా పడిపూజ మహోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మిదేవి చిత్రపటాలను ఉంచి గురుస్వాములు పెట్రోలు బంకు రామకృష్ణ, లక్ష్మిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి భక్తిగీతాలు ఆలపించి భజనలు చేశారు. పదునెట్టాంబడిపై కర్పూర దీపాలు వెలిగించి స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమ అనంతరం దీక్షదారులు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానం



భోజనం అందజేస్తున్న నిర్వాహకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని నిస్సహాయకులకు, సాధువులకు, వృద్ధులకు, యాచకులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని దాతలు ఉప్పరపల్లి శ్రీపతి ఫ్యామిలీ, ఎస్‌వీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు ఈ కార్యక్రమం నిర్వహించారని సమితి చైర్మన్ సునీల్ కుమార్ తెలిపారు. శ్రీపతి శ్యామసుందర్, షాలేం రాజు, నారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం

బద్వేలు అర్బన్ : స్థానిక గౌరీశంకర్‌నగర్‌లో వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య ఆగమశాస్త్రయుక్తంగా బోయలకుంట్ల రాజశేఖర్‌శర్మ దంపతుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి మధ్యాహ్నం భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవా సంఘం కార్యదర్శి చెప్పలి వెంకటేశ్వర్లు, యువజన విభాగం నాయకులు పవన్ పాల్గొన్నారు.

క్షమాగుణం క్రీస్తుమార్గం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు





ప్రొద్దుటూరు కల్చరల్ : మన్నా చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ పీటర్, భక్తి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మైదుకూరురోడ్డులోని ఎస్పీజీ-1, గోకుల్‌నగర్‌లోని ఎస్పీజీ-2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, రామేశ్వరం సీఎస్ఐ, వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లి తదితర అన్ని చర్చిల్లో అర్ధరాత్రి, ఉదయం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుని వాఖ్యాన్ని వినిపించారు. క్రిస్మస్ సందర్భంగా ప్రేమవిందు ఏర్పాటు చేశారు. రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో డివిజనల్ చైర్మన్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు రాక లోకానికి శుభసూచకమని, ఆయన మహిమలను తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ ప్రార్థనలు జరిగాయి. స్త్రీ మైత్రీ సభ్యులు ప్రదర్శించిన క్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే నాటకం అందరిని ఆకట్టుకుంది. స్థానిక శ్రీనివాసనగర్‌లోని మన్నా చర్చిలో పాస్టర్ పీటర్ క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను, క్రీస్తు మానవాళికి చూపిన సన్మార్గాన్ని వివరించారు.

క్రిస్మస్ ట్రీ ఊరేగింపు

ప్రొద్దుటూరు : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని కొత్తపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ ట్రీని ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కొత్తపేట గ్రామంలోని మాజీ సర్పంచ్ గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి ఇంటి వద్ద నుంచి సాంప్రదాయబద్ధంగా క్రిస్మస్ ట్రీని ఊరేగింపుగా రామాపురం చర్చికి తీసుకెళ్లారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సంఘ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

చాపాడు : మండల వ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు జరుపుకున్నారు. మండలంలోని చాపాడు, అల్లాడుపల్లె, విజయనగరం, పల్లవోలు, చిన్నగురువకూరు, మొర్రాయిపల్లె, మడూరు, అన్నవరం, చియ్యపాడు, రాజుపాళెం, అనంతపురం, ఎస్.ఓబాయపల్లె, కేతవరం, బద్రిపల్లె గ్రామాలలో సీఎస్ఐ చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. గుంతచీపాడు గ్రామంలోని చర్చిలో మాజీ ఎంపీటీసీ మహేష్ యాదవ్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేశారు.

కనుల పండువగా క్రిస్మస్ వేడుకలు

ఖాజీపేట : పవిత్రమైన క్రిస్మస్ పండుగను మండలంలో కనుల పండువగా నిర్వహించారు. ఖాజీపేటలోని ఆర్‌సీఎం చర్చి, టీచర్స్‌కాలనీ, పత్తూరు, పుల్లూరు చర్చిల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి ఏసు క్రీస్తు చేసిన సేవలను చర్చి ఫాదర్ భక్తులకు వివరించారు. చర్చి ఆవరణంలో ఆటల పోటీలను నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరులో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక శాంతినగర్ సీఎస్ఐ, సాయినాథపురం సీఎస్ఐ, టౌన్ షాలోమ్, బద్వేలు రోడ్డులోని ఆర్‌సీఎం తదితర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో బైబిల్ వాక్యాలను పాస్టర్లు చదివిని వినిపించారు. క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. శాంతినగర్ చర్చిలో పాస్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

ప్రత్యేక ప్రార్థనలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని క్రైస్తవ సోదరులు బుధవారం క్రిస్మస్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిలలో మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రెస్బిటర్ జీవన్‌స్వరాజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు మార్గం .. అనుసరణీయం అని క్రీస్తును స్తుతించారు. అలాగే ఫాతిమామాత చర్చిలో విచారణ గురువులు ఫాదర్ లక్కినేనిఆరోగ్యరాజు ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించారు. అలాగే స్థానిక మైదుకూరురోడ్డులోని పునీత ఆంతోనివారి దేవాలయంలో నిర్వహించిన ప్రార్థనల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫాదర్ డాక్టర్ సగినాలపాల్‌ప్రకాష్, రెవ. ఫాదర్ గొల్లపల్లెచిన్నప్ప, ముండ్లపాటిజాన్‌కిశోర్‌లు దివ్య బలిపూజ నిర్వహించి దైవసందేశం ఇచ్చారు. స్థానిక సుందరయ్యకాలనీలోని బ్లెస్సింగ్‌చర్చిలో రెవ. ఫాదర్ వీరదాసరిభాస్కర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని బేతెస్థ, హోసన్నా, గాడ్‌మినిస్ట్రీస్, మార్తోమా చర్చిలతో పాటు కొత్తచెరువు, నందిపల్లె గ్రామాల్లోని చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుప్పట్లు పంపిణీ

పట్టణంలోని తెలుగుగంగకాలనీలోని నిరాశ్రయుల వసతిగృహంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముండ్లపాటి పిచ్చయ్య ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సహాయులపై కరుణ, సాటి వారిపై ప్రేమ చూపడం ద్వారా సన్మార్గం వైపు నడవచ్చని క్రీస్తు చేసిన మార్గనిర్దేశం ప్రకారం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పిడతలరవి, సుకన్య, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని అన్ని చర్చిలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొని అనంతరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చర్చిల్లో ఫాదర్లు దైవసందేశం ఇచ్చారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కలసపాడు : మండలంలోని క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కలసపాడులోని పరిశుద్ధ పరిపాలు చర్చి, కలసపాడు, చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అలాగే చర్చి డీనరీ చైర్మన్ రెవ. ఆనంద్‌కుమార్, రెవ. ఆశిస్‌గాబ్రియేల్, ఆర్సీఎం చర్చి ఫాదర్ కొత్తపల్లిమనోహర్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీస్తు లోకరక్షణార్థం ఈ లోకానికి వచ్చారని, యేసు క్రీస్తు శాంతి నెలకొల్పేందుకు జన్మించారని తెలిపారు. ప్రార్థనల అనంతరం ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్‌కుమార్ (చిన్ను), మైనార్టీ నాయకులు షేక్‌సలీం సంయుక్తంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు దానం చేయాలి

రాజుపాళెం : పేదలకు తోచినంత దానం చేయాలని పాస్టర్లు సీమా రాణి, అనిల్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాజుపాళెం ఎస్సీ కాలనీలోని టీసీసీ చర్చిలో పాస్టర్లు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సాయంత్రం చర్చి ఆవరణలో క్రీడా పోటీలను నిర్వహించి, పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

సన్మానం

పోరుమామిళ్ల : క్రిస్మస్ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సత్యప్రకాష్, ఆయన భార్య జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత జస్లీనాను బుధవారం మార్కాపురం ఎస్‌పీజీ చర్చిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ గురువు జోసెఫ్‌బాబు, సంఘ పెద్దలు దావీదు, బెంజిమన్, భాదస్కర్, సందీప్ పాల్గొన్నారు.



చాపాడు : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్



ఖాజీపేట : పుల్లూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్



మైదుకూరు : శాంతినగర్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ వినయ్ కుమార్



బద్వేలు అర్బన్ : వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు



కలసపాడు : పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, పాస్టర్



రాజుపాళెం : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు



ప్రొద్దుటూరు : క్రిస్మస్ వేడుకల్లో పోరెడ్డి కుటుంబ సభ్యులు



కలసపాడు : గుడిప్రదక్షిణ చేస్తున్న విశ్వాసులు



బద్వేలు అర్బన్ : సీఎస్ఐ చర్చిలో దైవసందేశమిస్తున్న ప్రెస్బిటర్ జీవన్‌స్వరాజ్



పోరుమామిళ్ల : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వుట్టి నాగశయనం తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణమండపంలో బుధవారం దేవాంగ సంక్షేమ సంఘం, కల్యాణ మండపం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమసంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ సంఘం, కల్యాణమండపం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా క్యాలెండర్లను రూపొందించి కులబాంధవులకు, మిత్రులకు పంపిణీ చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారి కృపతో అందరికి శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి కాటం రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు పోసా రామచంద్రుడు, క్యాలెండర్ కో ఆర్డినేటర్ గిద్దలూరు గంగాజలంధర్, కల్యాణమండపం శాశ్వత గౌరవాధ్యక్షుడు వుట్టి వీరయ్య, సందుశివనారాయణ, అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

స్థానిక ఆంధ్ర కేసరి రోడ్డులోని అఖిలభారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సంఘం అధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వైస్‌ప్రెసిడెంట్ జీసీ పుల్లయ్య, ప్రతినిధులు నల్లం నాగభూషణం, నల్లం శంకర్, దుగ్గి లక్ష్మయ్య, విజయ భాస్కర్, సురేంద్ర, చంద్రశేఖర్, రమణ, రమణయ్య, ప్రసాద్, కృష్ణయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : మండలకేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో బుధవారం యాదవ సమాజ నిత్య అన్నదానం సత్రంనందు 2025 సంవత్సరం క్యాలెండర్‌ను అన్న సత్రం కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

7న చిత్రలేఖన పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని జనవరి 7న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. కళాశాలలో బుధవారం చిత్రలేఖన పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లలోపు విద్యార్థులకు స్వామి వివేకానంద చిత్రం, 30 ఏళ్లలోపు యువతకు ప్రకృతిని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో జరుగబోయే పరిణామాలు అనే అంశాలపై చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. రెండు విభాగాల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5116, ద్వితీయ బహుమతిగా రూ.3116, తృతీయ బహుమతిగా రూ.2116లతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, వివేకానందుని సాహిత్యం అందిస్తామన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కడప అర్బన్: కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జీ.ఓ.నెం. 145ను రద్దు చేయాలని జిల్లా కోర్టు ఎదురుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. ఈ దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరుకున్నాయి.

హామీలను విస్మరించిన కూటమి



రాజీవ్ బాషాను సత్కరిస్తున్న రెడ్యం

ఖాజీపేట : ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు రాజీవ్ బాషా మండిపడ్డారు. ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో కడప ఎపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధిష్టానం కట్టబెట్టిన పదవి న్యాయం చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను తిరిగి సీఎంగా చేసుకునేందుకు అందరూ కలసికట్టుగా పార్టీ కోసం కృషి చేయాలని సూచించారు.

ఉర్దూ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాష, సయ్యద్ ఇక్బాల్‌బాష ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కడప వినాయక నగర్‌లోని సిటీ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో రూట 35 సంవత్సరాల విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు.

ఏపీజీ బ్యాంకు కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న రఘునాథరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో బుధవారం ఆ బ్యాంకు కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు రైతులు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కరువు ప్రాంతమైన కడప జిల్లా బ్యాంకు కార్యాలయం ఉండటం వలన ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ఏపీజీ బ్యాంకు అగ్రస్థానంలో ఉందన్నారు. 552 బ్రాంచులు, రూ.50వేల కోట్ల టర్నోవర్‌తో రూ.802 కోట్ల లాభాలతో రూ.4591 కోట్ల రిజర్వ్‌తో వ్యాపారంలో ఇతర గ్రామీణ బ్యాంకుల కన్నా అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలోని 4 గ్రామీణ బ్యాంకుల విలీనంలో భాగంగా ఏపీజీ బ్యాంకు కార్యాలయాన్ని అమరావతికి తరలించడం తగదన్నారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల మేరకు బ్యాంకు డిపాజిట్లు టర్నోవర్ దృష్టిలో పెట్టుకుని విలీనంలో ఏపీజీ బ్యాంకుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని దీనిలో భాగంగా కడప కార్యాలయాన్ని కొనసాగించాలని కోరారు. ఇప్పటికే లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఈ కేంద్రం, హైకోర్టును అమరావతికి తరలించినందున ఈ బ్యాంకును తరలించి రాయలసీమకు అన్యాయం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్ బాషా, గ్రంథాలయ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ డివిజన్ కోశాధికారి కృష్ణ, జేవీవీ నాయకులు తవ్వాసురేష్, రాజేష్, మురళీ గుప్త, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు నిలదీత తప్పదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : రాబోయే రోజుల్లో కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 27న ప్రొద్దుటూరులో నిర్వహించనున్న ‘విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట’ పోస్టర్లను బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ 27న ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని వసంతపేట సాయిబాబా ఆలయం వద్ద నుంచి గాంధీరోడ్డు, స్టేట్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు మీదుగా ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీగా చేరుకుంటామన్నారు. అక్కడ నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, వార్డు మెంబర్లు, ఉపాధ్యక్షులు, పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు మాటలు నీటి మూటలు

సీఎం చంద్రబాబు మాటలు నీటి మూటలేనని ఎద్దేవాచేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచమని, తగ్గిస్తామని చంద్రబాబు, ఇతర కూటమి నాయకులు చెప్పిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే విద్యుత్ చార్జీలను పెంచి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని పేర్కొన్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో రూ.7–8 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు రంగం సిద్ధమైందన్నారు. విద్యుత్ బిల్లులను ఎందుకు పెంచుతున్నారని వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు ప్రశ్నిస్తే కూటమి నాయకుల వద్ద సమాధానం లేదని చెప్పారు. చంద్రబాబునాయుడిలా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా మోసపూరిత హామీలను ఇచ్చి ఉంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినా టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేసేందుకు ప్రజల తరపున పోరాటం చేస్తామని ప్రకటించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మండల ప్రెసిడెంట్ మార్తల ఓబుళరెడ్డి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, నాక నాగేంద్రారెడ్డి, నాయకులు పస్నీటి కాశయ్య, గోటూరు వెంకటేష్, భీమునిపల్లె నాగరాజు, జంగమయ్య పాల్గొన్నారు.

రేపు బైక్ ర్యాలీ

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఇష్టారాజ్యాంగా పెంచడంపై నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విద్యుత్ వినియోగదారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో బైక్‌లపై ర్యాలీగా నంద్యాల రోడ్డులోని ఏపీఎస్‌పీడీసీఎల్ మైదుకూరు డివిజన్ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ కూటమి ప్రభుత్వం ప్రజలకు భారమయ్యే విధంగా విద్యుత్ చార్జీలను పెంచినందుకు నిరసన వ్యక్తం చేయనున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు.